ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 7 ఆగస్టు 2025







గ్రామ పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం

- వార్డుల వారీగా నేటి నుంచి మ్యాపింగ్
- ఈ నెల 10 వరకు పూర్తి చేయాలని ఆదేశాలు
- గుజరాత్ నుంచి జిల్లాకు చేరిన 1,465 బ్యాలెట్ బాక్సులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం సన్నద్ధం చేస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహిస్తారా, గ్రామ పంచా యతీ ఎన్నిక లను నిర్వహిస్తారా అనే విషయమై స్పష్టత లేదు. గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఈ నెల 10వ తేదీకల్లా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు జిల్లా పంచాయతీ అధికారి వీరబు చ్చయ్య బుధవారం మండల పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి మ్యాపింగ్ కోసం సన్నద్ధం చేశారు. జిల్లాలో జూన్ నెల వరకు సిద్ధంగా ఉన్న బ్యాలెట్ బాక్సులు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అక్కడికి తీసుక వెళ్లారు. రాష్ట్రంలో ఎప్పుడైనా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉండడంతో ప్రభు త్వం హుటాహుటిన గుజరాత్ రాష్ట్రం నుంచి జిల్లాకు బ్యాలెట్ బాక్సులను తెప్పించింది. వడోదర నుంచి 905 బాక్సులు, ఉదయ్‌పూర్ నుంచి 560 బాక్సులు, మొత్తం 1,465 బాక్సులు మంగళ వా రం జిల్లాకు చేరాయి. ఇంకా కొన్ని రావాల్సి ఉన్నాయి.

జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు, 2,432 వార్డులు ఉన్నాయి. 2019లో మూడు విడతల్లో ఎన్ని కలు నిర్వ హించగా, ఇప్పుడు కూడా మూడు విడతల్లోనే ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఒక్కో విడతలో ఎన్ని కలు నిర్వహించేందుకు 1650 నుంచి 1800కు పైగా బ్యాలెట్ బాక్సులు అవసరం ఉంటాయని అధికారులు చెబుతున్నారు. మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు తక్కువ బ్యాలెట్ బాక్సులు అవసరం ఉంటాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఇటీ వల ఖరారు చేసిన తుది ఓటర్ల జాబితాను అను సరించి గ్రామ పంచాయతీల వారీగా ఓటర్లను వేరు చేసి, ఆ పంచాయతీలో ఉన్న వార్డుల సంఖ్య ఆధారంగా వార్డుల వారీగా ఓటర్ల మ్యాపింగ్ చేయను న్నారు. గతంలో ఎన్నికలు నిర్వహించని లింగాపూర్, వెంకట్రావుపల్లి, ఎల్కలపల్లి గేట్‌లు తిరిగి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించారు. కుందనపల్లి పంచాయతీ పరిధిలోని అక్బర్ నగర్‌ను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ఇవిగాకుండా ప్రస్తుతం 263 పంచాయతీలు ఉండగా, కుందనపల్లితో కలుపుకుని 264కు చేరనున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం యేటా నాలుగు నెలలకోసారి ఓటర్ల జాబితాలను సవరిస్తు న్నది. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాల్సి ఉంటుంది. గతంలో యేటా జనవరి మొద టి వారంలో ఓటర్ల తుది జాబితాను ప్రకటించే వారు. ఇప్పుడు నాలుగు విడతల్లో ఓటర్ల సవరణ చేస్తున్నారు. గత నెలలో

(మిగతా 8వపేజీలో)

సాగుపై ఆశలు

- రెండు రోజుల్లో జిల్లాకు చేరనున్న ఎస్సారెస్పీ నీరు

పెద్దపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ నీరు రెండు రోజుల్లో జిల్లాకు చేరనుంది. మునుపెన్నడూ లేని విధంగా ప్రాజెక్టు నీటిమట్టం 50 టీఎంసీలకు చేరక ముందే గురువారం నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకున్నది. తెలంగాణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ సమావేశంలో ఎస్సారెస్పీ నుంచి ఈ నెల 7వ తేదీన ఉదయం 11 గంటలకు కాకతీయ ప్రధాన కాలువ, సరస్వతీ, లక్ష్మి కాలువలకు సాగు నీటిని విడుదల చేయనున్నట్లు పోచంపాడ్ ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ టి శ్రీనివాస్ గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 40.582 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 793 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 45.758 టీఎంసీల నీళ్లు ఉన్నప్పటికీ, సాగు నీటిని విడుదల చేయలేదు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సరిపడా వర్షాలు పడక పోవడంతో వ్యవసాయ బావులు, చెరువులు, కుంటల కింద వరినాట్లు సాగవడం లేదు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. రైతుల నుంచి వ్యతిరేకత మొదలు కాకముందే ఎప్పటిలాగానే ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో రెండు జోన్లుగా విభజించి సాగు నీటిని కాకతీయ ప్రధాన కాలువకు విడుదల చేయనున్నారు. ప్రాజెక్టు నీటి మట్టం 50 టీఎంసీలకు చేరనిదే ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేయరు. కానీ వరుణడిపైనే భరోసా పెట్టుకున్న ప్రభుత్వం సాగు నీటి విడు దలకు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తున్నది. ఎస్సారెస్పీ ఎగువ భాగాన కూడా వర్షాలు పడడం లేదు. వారం రోజుల క్రితం ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు ఎస్సారెస్పీ ఎగువ భాగాన మహారాష్ట్రలో పడిన భారీ వర్షానికి ప్రాజెక్టులోకి ఒక్కసారిగా లక్షకు పైగా క్యూసెక్కుల వరద నీరు 24 గంటల పైగా రావడంతో ఒక్కరోజే 10 టీఎంసీల నీళ్లు వచ్చి చేరుతాయి. వాస్తవానికి ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఆగస్టు నెలలోనే వర్ష పాతం ఎక్కువ. అదే నమ్మకంతో ప్రభుత్వం సాగు నీటిని విడుదలకు పూనుకున్నది. 7న నీటిని విడుదల చేస్తే, జిల్లాలోని డి-83, డి-86 కాలువలకు రెండు రోజుల్లో నీళ్లు చేరనున్నాయి.



శ్రీపాద ఎల్లంపల్లి నీటిమట్టం 12.444 టీఎంసీలు..

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టం 12.444 టీఎంసీలకు చేరుకున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు. గత ఏడాది ఈ సమయానికి ప్రాజెక్టు నిండి పోగా, జూలై 25 నుంచే మిడ్ మానేరుకు ఎత్తిపోతలను ఆరంభిం చారు. ఈసారి ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో, ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురవని కారణంగా ప్రాజెక్టు లోకి వరద నీరు రావడం లేదు. భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టు నిండి, ఇక్కడి నుంచి మల్లన్న సాగర్‌కు మిడ్ మానేరు మీదుగా నీటిని సరఫరా చేయనున్నారు.

జ్వరంతో ఇద్దరు విద్యార్థుల మృతి


చింతల దీపక్(ఫైల్)


వెంకటేష్ (ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కేసీఆర్ కాలనీలో నివాస ముండే చింతల దీపక్(16) అనే విద్యార్థి అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. నంది మేడారం గురుకులంలో తొమ్మిదో తరగతి చదువుతున్న దీపక్‌కు ఈనెల 4న జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. అతనికి ఊపిరితిత్తులు, లివర్‌కు సంబంధించిన సమస్యలు తీవ్రం కావడంతో 5వ తేదీన అతన్ని కరీంనగర్‌కు రెఫర్ చేశారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ మెడికల్ కళాశాల అనుబంధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. పారిశుద్య లోపం వల్లే బాలుడు మృతి చెందినట్లు మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత ఆరోపించారు. అనారోగ్య కారణాల వల్లే అతను మృతి చెందినట్లు అడ్డగుంటపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం సీఓ పేర్కొంటున్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన దేవళ్ళ వెంకటేష్ (18) అనే యువకుడు విష జ్వరంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వెంకటేష్ ఈనెల 4న జ్వరం రావడంతో వెంకటేష్‌ను గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. అతనిడి బ్లడ్ ఇన్‌ఫెక్షన్, కిడ్నీ సమస్య రావడంతో 5న మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ చల్మెడ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వారు తెలిపారు. వెంకటేష్ మంథనిలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు.

వైభవంగా ఆదివరాహ స్వామి కల్యాణం

కమాన్‌పూర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి జయంత్యుత్సవాలలో భాగంగా బుధవారం స్వామి వారికి భూదేవి, శ్రీదేవిలతో అంగ రంగ వైభవంగా కల్యాణం జరిపించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వివాహమహోత్సవం జరిగింది. స్వామి వారికి నిత్యాభిషేకం, గోపూజ, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. వేదపండితులు కలకుంట్ల వరప్రసాద స్వామి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ఈవో కాంతారెడ్డి సౌకర్యాలు కల్పించారు. అలాగే పోలీసులు భక్తుల కు ఇబ్బందులు రాకుండా భద్రత చర్యలు చేపట్టారు. కొందరు భక్తులు అన్నదానం నిర్వహించారు.


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శిస్తే
కాంగ్రెస్ నేతలకు ఉలుకెందుకు

పెద్దపల్లి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు పంపుహౌస్‌లను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో సందర్శిస్తే కాంగ్రెస్ నేతలు ఎందుకు ఉలికి పడుతున్నారని, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను విమర్శించడం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు తగదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పేర్కొన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆరు పర్యాయాలు కొప్పుల ఈశ్వర్ గెలుపొంది ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. ఆయన సారథ్యంలో కన్నెపల్లి పంప్ హౌస్‌ను సందర్శించామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్, నాయకులపై విమర్శలకు దిగుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమం కూడా నీళ్లు, నిధుల కోసమే జరిగిందని గుర్తు చేశారు. పుట్ట మధుకర్ మాట్లాడుతూ మంత్రి పదవిలో ఉన్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గోదావరి స్వరూపాన్ని గురించి మాట్లాడితే బాగుండేదన్నారు. వైఎస్సార్ తర్వాత వ్యవసాయం, పంటల గురించి అవగాహన వారికి లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితేనే భూములు సస్యశ్యామలమయ్యాయని అన్నారు. రేషన్ కార్డుల గురించి తప్ప మరొకటి మాట్లాడడం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల కు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, సీనియర్ నాయకులు గోపు ఐలయ్య యాదవ్, గంట రాములు యాదవ్, ఉప్పురాజ్ కుమార్, నారాయణదాసు మారుతి, పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, రవీందర్, మధు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందర్

అన్ని కులాల అభ్యున్నతికి బీజేపీ కృషి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు


ప్రసంగిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

జ్యోతినగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని అన్ని కులాల అభ్యున్నతికి బీజేపీ కృషి చేస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. బుధవారం రాత్రి ఎన్టీపీసీలో జరిగిన కుల సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో రాంచందర్‌రావు ప్రసంగించారు. కుల వృత్తులను కాపాడేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని, కుల వృత్తుల వారిగా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. కేంద్ర పథకాలను అర్హులైన కుల వృత్తులు చేస్తున్న ప్రజలకు చేరేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కుల వృత్తులన్నీ వెనుకబడిన కులాలకు చెందినవేనని, బీసీలకు మేలు చేసేందుకు మోదీ సర్కారు పని చేస్తోందని తెలిపారు. గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కుల వృత్తుల గురించి ప్రగల్భాలు పలికిందని, కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో వెయ్యి కోట్ల కుంభకోణం బయట పడిందన్నారు. త్వరలో కోల్‌బెల్ట్ ఏరియాలో పర్యటన చేపడుతానని, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.కుమార్, మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, శ్రీనివాస్ గొమాసె, సునీల్‌రెడ్డి, బల్మూరి వనిత, మెరుగు హన్మంతు గౌడ్, క్యాతం వెంకట రమణ, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం...



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబిందు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరమని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రిన్సిపాల్ హిమబిందు, డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం మెడికల్ కళాశాల విద్యార్థులు తల్లిపాల ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు తప్పని సరిగా పట్టించాలని, ఆరునెలల వరకు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యవంతంగా, బలంగా ఉంటారని, పుట్టిన పిల్లలకు ముర్రిపాలు పట్టించాలన్నారు. కొందరు పిల్లలకు డబ్బా పాలు పెడుతున్నారని, అది శ్రేయస్కరం కాదని, పిల్లలు రోగ నిరోధక శక్తిని కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలి


వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. బుధవారం ఉదయం కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డు, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగంలో ఉదయం తొమ్మిదన్నరకు తర్వాత ఆరుగురు వైద్యులు ఆలస్యంగా రావడం గమనించి ఇలాంటివి పునారవృతం కాకుండా ఉండాలని, అవసరం అయితే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్, ఆర్ఎంఓలను కలెక్టర్ ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ, ఔట్ పేషెంట్ సేవలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలని, వైద్యుల హాజరు పై సరైన పర్యవేక్షణ ఉండాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం అమలులోకి తీసుకొని రావాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పెంచుకోవాలని, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రీమియం రేంజ్ లో సేవలు, పారిశుధ్య సేవలు ఉండాలని, దీనికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామన్నారు. ప్రభుత్వ వైద్యులు డ్యూటీ సమయంలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది పేషెంట్లతో మర్యాద పూర్వకంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయూష్ ఆసుపత్రి విభాగం పరిశీలించిన కలెక్టర్ అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఆయూష్ ఆసుపత్రిలో నెల రోజులకు అవసరమైన మందులు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

ఆచార్య జయశంకర్ సార్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న అధికారులు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదన్నారు. తొలి, మలి ఉద్యమాలను నిర్వహించిన తీరును వివరించారు. స్వరాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేశారని, రాష్ట్ర అభివృద్ధికి మంచి ప్రణాళికలు సైతం రూపొందించారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు మనమంతా కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ దాసరి వేణు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో కాంట్రాక్టు కార్మికులను వేధిస్తున్న సూపర్‌వైజర్

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కాంట్రాక్టు కార్మికురాలు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కాంట్రాక్టు మహిళా కార్మికులను ఓ సూపర్‌వైజర్ వేధింపులకు గురి చేస్తుండడంతో ఓ కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇటీవల నలుగురిని విధుల నుంచి తొలగించారు. మళ్లీ వారిని తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో విధుల్లో చేరడానికి వచ్చిన మహిళలపై ఓ సూపర్‌వైజర్ అసభ్యంగా ప్రవరిస్తూ మానసిక ఒత్తిడికి గురి చేశాడు. కేర్‌టేకర్‌లో పనిచేసే మహిళా కార్మికురాలు ఆసుపత్రి బిల్డింగ్‌పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా తోటి కార్మికులు అడ్డుకున్నారు. కొద్దిరోజులుగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓ సూపర్‌వైజర్ కార్మికులను వేధించడంతో పాటు వారిపట్ల అసభ్యంగా ప్రవరిస్తు న్నాడు. ఇతనిపై నర్సులు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనకు ఉన్నతాధికారుల అండ ఉన్నదని వేధింపులకు గురి చేస్తున్నాడు. డబ్బులుఇస్తే మంచి పనిస్థలాల్లో నియమిస్తానంటూ వేధింపులకు గురి చేయ డం, ఆసుపత్రిలో కార్మికులను వెళ్లగొట్టే విధంగా సూటిపోటి మాటలతో పలువురు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. విధుల నుంచి వెళ్లిపోయిన వారిస్థానంలో కొత్త వారిని నియమించుకుంటూ డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. సదరు సూపర్‌వైజర్ ఫొటోలు తీస్తు న్నాడని పదిరోజుల క్రితం నర్సులు కలెక్టర్, సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. అయినా సూపర్‌వైజర్‌ను మాత్రం అలానే కొనసాగిస్తుండడం పలు అనుమానాలకు దారితీస్తుంది.

పట్టించుకోని సూపరింటెండెంట్

ఆసుపత్రి సూపరింటెండెంట్ పట్టించుకోకపోవడంతో సూపర్‌వైజర్ల ఆగడాలు పెరిగిపోయాయి. ఆసుపత్రిని నిత్యం తనిఖీచేస్తూ రోగులకు మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయా, కార్మికుల పనిస్థలాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత సూపరింటెండెంట్‌పై ఉంటుంది. సూపరింటెండెంట్ అనారోగ్య కారణంతో ఆసుపత్రిలో సక్రమంగా విధులు నిర్వహించలేక పోవడంతో ఏదో ఒక సమస్య తలెత్తుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో విఫలమవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

చిగురుమామిడి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరిలో బుధవారం గ్రామానికిచెందిన గీరబోయిన అజయ్(21) బైక్ అదుపు తప్పి పడి మృతిచెందినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అజయ్ నవాబుపేటనుంచి స్వగ్రామం సుందరగిరికి బైక్‌వస్తున్నాడు. అదుపుతప్పి రోడ్డుపక్కనున్న విద్యుత్‌స్థంభాన్ని ఢీకొట్టాడు. దీంతో బలమైనగాయాలై సంఘటన స్థలంవద్దే మృతిచెందాడు. మృతుడు అజయ్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్నకొండలో గుర్తు తెలియని మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ శివారులోని వ్యవసాయబావిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమయింది. ఎస్ఐ నరేష్‌రెడ్డి కథనం మేరకు ఆర్నకొండ శివారులోని వ్యవసాయ బావిలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుమారు 40నుంచి 45సంవత్సరాల వయస్సు ఉండి, ఒంటిపై బిస్కెట్ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఎడమ చేతికి ఓం సింబల్ గల ఆరెంజ్ రంగు దారం ఉందని తెలిపారు. ఆర్నకొండ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్‌రెడ్డి తెలిపారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు గ్రామానికిచెందిన దయాకర్ (29) ఆర్థికఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దయాకర్ పెద్దపల్లి ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం వాహనం కొనుగోలుకు మూడు లక్షల రూపాయలు అప్పు చేశాడు. వాహనం కొనకపోవడం, అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాడు. ఆర్థికఇబ్బందులు భరించలేక ఇంట్లో ఎవరులేని సమయంలో మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య దేవపాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లి గ్రామానికి చెందిన మహంకాళి (53) చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడు మహంకాళి కొంతకాలంగా మద్యానికి బానిసైనట్లు బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

యువకుడి అదృశ్యం


రాజ్‌కుమార్

ధర్మారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందని చిప్ప రాజ్‌కుమార్(32) అనే యువకుడు సోమవారం కుమారుడి ఆసుపత్రి కాగితాలు తీసుకువస్తానని ఇంట్లో చెప్పి కరీంనగర్ వెళ్లాడు. రాత్రి వరకు రాకపోవడంతో అతని భార్య ఫోన్‌చేయగా కరీంనగర్ బస్టాండ్‌లో బస్‌కోసం చూస్తున్నానని, నేను వచ్చేసరికి ఆలస్యమవుతుందని చెప్పాడు. మంగళవారం తెల్లవారుజాము వరకు కూడా రాజ్‌కుమార్ రాకపోవడంతో భార్య ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. ఉదయం మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబసభ్యులు బుదవారం వరకు బంధువులతో పాటు అతనిస్నేహితులకు ఫోన్‌చేసి సమాచారం తెలుసుకోగా రాజ్‌కుమార్ ఆచూకీ లభించలేదు. రాజ్‌కుమార్ తండ్రి చిప్పరవి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో నెమలి మృతి

హుజూరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో బుధవారం జనావాసాల్లో నెమలి ప్రత్యక్షమైంది. పట్టణంలోని ఇల్లందుల వాడలో నెమలి సంచరిస్తుండగా వీధికుక్కలు దాడిచేశాయి. దీంతో నెమలికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన ఓ పాల వ్యాపారి నెమలిని కుక్కలబారి నుంచి కాపాడి అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అటవీశాఖాధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమచికిత్స చేద్దామని ప్రయత్నించగా, అప్పటికే నెమలి మృతిచెందింది. మృతి చెందిన నెమలిని అధికారులు పోస్టుమార్టంకు తరలించారు.

విద్యార్థుల కోసం ఎన్‌ఎస్‌పీ పోర్టల్



- స్కాలర్‌షిప్‌ల కోసం డిజిటల్ ఫ్లాట్‌ఫారం
- ఒకే గొడుగు కిందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు

చొప్పదండి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ విద్యార్థులకు ఆసరాగా నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు వివిధ ప్రభుత్వ సంస్థలు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లు అన్ని ఒకే గొడుకు కిందకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లోకి తీసుకువచ్చారు. ఎన్‌ఎస్‌పీ ఒక డిజిటల్ ఫ్లాట్ ఫారంగా నిలుస్తుండగా విద్యార్థులకు మంజూరైన స్కాలర్‌షిప్‌లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా జమ చేస్తారు. విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే వెరిఫై చేస్తారు. ఈ పోర్టల్‌లో విద్యార్థి ఒకసారి రిజిస్టర్ చేసుకుంటే అన్ని రకాల స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. విద్యార్థి వివరాలు, బ్యాంకు ఖాతా, ఆధార్, విద్యార్హతను ఈ పోర్టల్ ద్వారా డిజిటల్‌గానే వెరిఫై చేసి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తారు.

ఈ స్కాలర్‌షిప్‌లు 1వ తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు చదువుతున్న విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. వార్షిక కుటుంబ ఆదాయం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ ఈడబ్ల్యుఎస్ కేటగిరీల వారీగా విద్యార్థులకు 5 వేల నుంచి 50 వేల రూపాయల వరకు స్కాలర్‌షిప్‌లను ఏడాదికి అందజేయనున్నారు.

స్కాలర్‌షిప్ వివరాలు

ఎన్‌ఎస్‌పీలో కేంద్ర ప్రభుత్వం పలు రకాల స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంది.



- పోస్టు మెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్
- మెరిట్ కంమీన్స్ స్కాలర్‌షిప్
- టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్ (ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రమే)
- యూజీసీ స్కాలర్‌షిప్, ఇషాన్ ఉదయ్, సింగిల్ గర్ల్ చైల్డ్(పీజీ విద్యార్థులకు)
- ఏఐసీటీఈ-ప్రగతి స్కాలర్‌షిప్(బాలికలు), సక్షం స్కాలర్‌షిప్(దివ్యాంగులు)
- సీఎస్‌ఎస్‌ఎస్(సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ఆఫ్ స్కాలర్‌షిప్స్-డిగ్రీ, పీజీ విద్యార్థులకు)
- పోస్టు మెట్రిక్ స్కాలర్‌సిప్ ఫర్ ఓబీసీ స్టూడెంట్స్

దరఖాస్తు ప్రక్రియ

ఎన్‌ఎస్‌పీ పోర్టల్‌లో విద్యార్థులు తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలి. ఎన్‌ఎస్‌పీ అధికారిక వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. మొబైల్ నెంబర్ ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. ఓటీపీ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత విద్యార్థి వివరాలు, మెయిల్ ఐడీ, విద్యార్హతలు నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతల ధ్రువపత్రాలు, బ్యాంకు ఖాతా, సంబంధిత డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయాలి. అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. స్కాలర్‌షిప్ రెన్యువల్ గడువు ఆగస్టు 31 వరకు ఉంది.

11న ఎంజేపీ పాఠశాలలో ఇంటర్వ్యూలు

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అతిథి ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈనెల11న ఇంటర్వ్యూలు, డెమో నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్‌జిల్లా కన్వీనర్ అంజలి ఒకప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్ జువాలజీ(మహిళ), జేఎల్, కెమిస్ట్రీ (మహిళ), జెఎల్ ఇంగ్లీష్(జనరల్), పీజీటీ మాథ్స్ (జనరల్, మహిళ), జెఎల్ మాథ్స్ (మహిళ), పీజీటీ ఫిజికల్‌సైన్స్(జనరల్, మహిళ), పీజీటీ ఇంగ్లీష్(మహిళ), టీజీటీ ఇంగ్లీష్(జనరల్) సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన అభ్యర్థులు పీజీ, బీఈడ్ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. ఈనెల11న తిమ్మాపూర్ మండలంలో గల మహాత్మా జ్యోతి బాపూలే బాలికలపాఠశాలలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

పెద్దమ్మ దేవాలయంలో చోరీ

శంకరపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరడపల్లి పెద్దమ్మతల్లి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. పెద్దమ్మ దేవాలయంలో అమ్మవారి ముక్కుపుడక, పుస్తెలు, గల్లాపెట్టే అపహరణకు గురైనట్లు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

విద్యుత్ వైర్ల చోరీ

శంకరపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరడపల్లి గ్రామంలో ముగ్గురు రైతుల వ్యవసాయ బావుల వద్ద మోటర్లకు అమర్చిన విద్యుత్‌వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వీర్నపల్లి ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండా గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఎస్సై వేముల లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. మూడు లీటర్ల నాటుసారా సీజ్‌చేసి, 200లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. నాటుసారా తయారుచేసిన భూక్య సునీత, భూక్య దర్మలపై కేసు నమోద చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ లచ్చయ్య పీసీలు నవీన్, నయీంపాషా, యాకూబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు

ఉద్యోగం పేరుతో డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగంలో పెట్టిస్తానని, అందుకు రూ2 లక్షలు కట్టాలని ఫోన్‌లో మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆలయ ఉద్యోగులు సంబంధిత వ్యక్తిపై వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆడియో వైరల్‌పై దేవదాయ ధర్మదాయ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణరావు విచారణచేసి రిపోర్టు సమర్పించాలని ఆదేశించడంతో రాజన్న ఆలయ ఈవో ఆలయంలోని ఔట్ సోర్సింగ్ సిబ్బందిని సంప్రదించి సదరు గొంతు ప్రణయన్ హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ సర్వీసెస్, శాన్వి సర్వీసెస్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ, శివబాలాజీ కన్సల్టెన్సీ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్న లక్ష్మీనారాయణదిగా భావించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈవో పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామం మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ బూడిద విజయ్, ట్రాక్టర్ యాజమని నోముల తిరుపతి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కరీంనగర్‌లో కార్డెన్ సెర్చ్

- 85 వాహనాలు స్వాధీనం, జరిమానా విధింపు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ, టౌన్ ఏసీపీ వెంకటస్వామి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఒకటోఠాణా పరిధిలోని గాయత్రినగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపారు. కార్డెన్ సెర్చ్‌లో భాగంగా రెండు కాలనీలను పోలీసులు దిగ్బంధించారు. వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో మొత్తం 85 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనా లకు జరిమానా విధించారు.

వివిధ అంశాలపై అవగాహన..

కార్డెన్‌సెర్చ్ అనంతరం స్థానికులకు వివిధ అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే 1930కి కాల్‌చేయడం ద్వారా పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందవచ్చని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం చట్టరీత్యా నేరమన్నారు. వాటి దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీసీపీ వెంకటరమణ హెచ్చరించారు. అటువంటి సమాచారం ఉంటే డయల్100కు లేదా స్థానికపోలీసులకు తెలియజేయాలని కోరారు. షీటీమ్ సీఐ శ్రీలత మాట్లాడుతూ సోషల్ మీడియాలో జరిగే మోసాలపై అమ్మాయిలను హెచ్చరించారు. అపరిచితులకు ఫొటోలు పంపవద్దని, వేధింపులకు గురైతే భయపడకుండా షీటీమ్‌ను ఆశ్రయించాలని అన్నారు. ఫిర్యాదుచేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అంతకు ముందు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సీఐలు బిల్లా కోటేశ్వర్, సృజన్‌రెడ్డి, సదన్ కుమార్, శ్రీలత, పుల్లయ్య పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరస్థుడి అరెస్ట్

- ఆరోగ్యశ్రీ పేరుతో ఆన్‌లైన్ మోసాలు
- వెల్లడించిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్‌నేరస్థుడిని అరెస్టు చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన ముల్లుంటి సలీం మాలిక్(32) అనే వ్యక్తి ఢిల్లీకి చెందిన సత్యంతో కలిసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సలీం మాలిక్ ఆరోగ్యశ్రీ డబ్బులు వచ్చాయని బాధితులకు ఫోన్ ద్వారా తెలిపి, ఢిల్లీలో ఉన్న సత్యంకు కాన్ఫరెన్స్ కాల్ కలపగా అతడు బాధితులకు లింక్‌లు పంపేవాడు. లింకును క్లిక్ చేయగానే బాధితుల ఖాతాలో నుంచి డబ్బులు కట్ అయ్యేవి. దీనికి సహాయపడిన సలీంమాలిక్ కొంతడబ్బులు సత్యంకు పంపించేవాడు. జిల్లాలోని ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన రాజిరెడ్డి వీరి ద్వారా రూ.46వేలు మోసపోయి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ మహేష్ బి గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల రూలర్ సీఐ మొగిలి సూచనలతో కేసు నమోదు చేసిన ముస్తాబాద్ ఎస్సై గణేష్ దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా సైబర్ టీం ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది కిట్టు, గంగారెడ్డి, ముస్తాబాద్ కానిస్టేబుల్ కాసిం ప్రత్యేక టీమ్‌గా ఏర్పడి సాంకేతికత ఆధారంగా హైదరాబాద్‌లో బుధవారం నిందితుడు సలీం మాలిక్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరోనిందితుడు సత్యం పరారీలో ఉన్నాడని, త్వరలో అతన్నికూడా పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. నిందితులపై తెలుగు రాష్ట్రాల్లో 79 ఫిర్యాదులు ఉన్నాయని, సుమారు రూ.60లక్షలకు పైగా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు.


సిరిసిల్లలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్

పోక్సో కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

పాలకుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్‌పోలీస్‌స్టేషన్ పరిధిలోని కన్నాలలో బాలికనువేధింపులకు గురిచేసిన కన్నం సాగర్(30)కి బుధవారం జిల్లాకోర్టుజడ్జి సునీత ఏడేళ్ల కఠినకారాగారశిక్ష, 11వేల జరిమానా విధించినట్లు బసంత్‌నగర్ ఎస్ఐస్వామితెలిపారు. కన్నాలగ్రామానికి చెందిన బాలిక బడికివెళ్లి తిరిగివస్తున్న సమయంలో ప్రేమపేరుతో సాగర్ వేధించేవాడు. బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా సాగర్ బాలిక ఇంట్లోకి వెళ్లగా ఆమెకేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు రావడంతో సాగర్ పారిపోయాడు. బాలిక ఇచ్చిన ఫిర్యాదుమేరకు అప్పటి ఎస్ఐ ఉమసాగర్ కేసునమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కుతరలించాడని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదంరమేష్, పెద్దపల్లిడీజీపీ పుల్లాకరుణాకర్, ఏసీపిగజ్జికృష్ణ, సాక్ష్యులను ప్రవేశపెట్టడానికి సహకరించిన సీఐ కె ప్రవీణ్‌కుమార్, కోరు సీడీవో వెంకటేశ్వర్లు నేరస్తుడికి శిక్షపడడంలో కృషిచేశారని ఎస్ఐ తెలిపారు.

తీసుకున్న అప్పు ఇవ్వాలని ఇంటి ముందు బైఠాయింపు

గంగాధర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న అప్పు చెల్లించాలని మాజీ సర్పంచ్ ఇంటిముందు కొందరు బైఠాయించారు. గంగాధర మండలం గర్షకుర్తి మాజీసర్పంచ్ అలువాల నాగలక్ష్మి రెండేళ్ల క్రితం గ్రామంలో మన ఊరు మన బడి పనులు చేపట్టారు. ఇందుకోసం గ్రామంలో కొందరి వద్ద అప్పుతీసుకున్నాడు. పనులు పూర్తి చేసి రెండు సంవత్సరాలు దాటినా బిల్లులు రాకపోవడంతో ఆయన అప్పు చెల్లించలేదు. బుధవారం సర్పంచ్ కుటుంబ సభ్యులు బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి వచ్చేసరికి అప్పులిచ్చిన వారు డబ్బు చెల్లించాలని ఇంటిముందు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో సర్పంచ్ గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాకు పనులు చేసినవి 12లక్షలు రావాల్సి ఉందని రాగానే ఇస్తానని చెప్పిన వినిపించుకోలేదని నాకు బిల్లులు వచ్చేంత వరకు గంగాధర చౌరస్తాలో ధర్నాకు దిగుతానని పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు ఆయనను సముదాయించి ఇంటికి పంపించారు.

అక్రమ ఇసుకను గుర్తించిన పోలీసులు

ధర్మారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాయంపేట గ్రామంలో అక్రమంగా డంప్‌చేసిన ఇసుకను పోలీసులు గుర్తించారు. శాయంపేట శివారులోని ప్రభుత్వభూమి సర్వేనంబర్ 84లో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా ఇసుక నిల్వ చేశారన్న సమాచారం మేరకు బుధవారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్రమంగా నిల్వ ఉన్న దాదాపు 15 ట్రిప్పుల ఇసుకకు సంబంధించిన తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్‌చేశారు. శాయంపేట పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు ఉదయం 10గంటలకు గ్రామపంచాయతీ వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

ఇసుక డంపును స్వాధీనం చేసుకున్న పోలీసులు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామశివారు హనుమాన్‌గుడి వద్ద అక్రమంగా నిల్వఉన్న ఇసుక డంపును బుధవారం పోలీసులు గుర్తించారు. ఈమేరకు వారు డంపులను పరిశీలించి, స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఇసుక సరఫరాపై తహసీల్దార్ అధ్యక్షతన పోలీస్‌స్టేషన్‌లో ఇసుకవ్యాపారులు, ట్రాక్టర్ యజమానులతో సమావేశం నిర్వహించిన మరుసటి రోజునే పెద్ద మొత్తంలో ఇసుక డంపును గుర్తించడం చర్చనీయాంశంగా మారింది.

గుట్టుచప్పుడు కాకుండా కల్తీమద్యం తయారీ

- బ్రాండెడ్ మద్యం సీసాల్లో చీప్ లిక్కర్ నింపి విక్రయం
- ఇద్దరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

వేములవాడ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బ్రాండెడ్ మద్యం సీసాల్లో చీప్ లిక్కర్‌ని నింపి విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వేములవాడ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్‌రావు వివరాలను వెల్లడించారు. వేములవాడ మండలంలోని రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన తునికి కార్తీక్ బ్రాండెడ్ కంపెనీలకు చెందిన ఖాళీ మద్యంసీసాలను సేకరించి వాటిలో చీప్‌లిక్కర్ నింపి స్థానికంగా విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం సాయంత్రం కార్తీక్ ఇంటికి వెళ్లి తనిఖీలు నిర్వహించగా ఖాళీసీశ్ల సీసాలలో నింపిన మద్యంతో పాటు పలు బ్రాండెడ్ సీసాల్లో నింపిన మద్యం లభించిందన్నారు. కార్తీక్‌ను విచారించగా వేములవాడ పట్టణానికి చెందిన దామరపల్లి సంతోష్ అనే మరోయువకుడి సాయంతో 6నెలలుగా ఈ అక్రమ దందా నిర్వహిస్తున్నట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. దీంతో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కార్తీక్ వద్ద నుంచి 9రెండు లీటర్ల వాటర్ బాటిల్స్, మరో 9లీటర్ వాటర్ బాటిల్స్, 3సిగ్నేచర్ బాటిల్స్‌లోని మద్యాన్ని, సంతోష్ వద్ద గల 750 మిల్లీలీటర్ల పరిమాణంలో 3సిగ్నేచర్, 3 విలయమ్సన్, ఐబీ, ఆర్‌సీ, రెడ్‌లేబుల్, రాయల్ గ్రీన్ ఒక్కో బాటిల్స్‌తో పాటు మరో అరలీటర్ మద్యం బాటిల్స్‌తోకలిపి సుమారుగా రూ.50 వేల విలువగల మద్యాన్ని సీజ్ చేశారు. గత 6 నెలలుగా సుమారు రూ.2 లక్షల వ్యాపార లావాదేవీలు కొనసాగించినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై రవి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై శైలజ సిబ్బంది ఉన్నారు.


నిందితులను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర

- రోడ్డుపై బైఠాయించి ఆందోళన

గంబీరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కరెంటు కోతలపై రైతుల కన్నెర్ర చేశారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడటంతో పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. గంబీరావుపేట మండలం కొత్తపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలోని రాజుపేట, కొత్తపల్లి, కోళ్ళమద్ది శ్రీగాధ గ్రామాలకు చెందిన రైతులు కరంటు కోతలపై బుధవారం ఆందోళన చేపట్టారు. సెస్ ఏఈ అక్కడికి చేరుకుని వారం రోజుల్లో విద్యుత్ సమస్య లేకుండా చూస్తానని హామీఇవ్వడంతో రైతులు శాంతించారు. ఆందోళనలో రైతులతోపాటు కొత్తపల్లి సింగిల్‌విండోఛైర్మన్ భూపతిసురేందర్, మాజీసర్పంచ్‌లు అల్లె సత్యం, నాగరాజుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ మహేష్, గౌసొద్దీన్, సత్యం, సుదాకర్, రమేష్, నరేష్,కిషన్,రాజు,ఎల్లారెడ్డి,సుదర్శన్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామశివారులోని గుడిసెలో అక్రమంగా నిల్వచేసిన 10క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన నర్రావుల కొమురయ్య కొంతకాలంగా అక్కపల్లి గ్రామంలో నివసిస్తున్నాడు. పీడీఎస్ బియ్యం నిల్వ చేశాడనే సమాచారంతో సోదాచేయగా 10క్వింటాళ్లు లభించాయని చెప్పారు. బియ్యాన్ని స్వాధీనపర్చుకుని కొమురయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

తిమ్మాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీ గ్రామం వద్ద రాజీవ్‌రహదారిపై బుధవారం రాత్రి పెనుప్రమాదం తప్పింది. హైదరాబాద్‌వైపు నుంచి కరీంనగర్‌వైపు వెళుతున్న ఓ కారు రామకృష్ణాకాలనీ వద్ద రాజీవ్‌రహదారిపై అదుపుతప్పి రోడ్డుమధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంటూ కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపు వెళుతున్న మరో కారును ఢీకొంది. ఈప్రమాదం జరిగినవెంటనే అటునుంచి హైదారాబాద్ వెలుతున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్ ఒక్కసారిగా నిలిపేశాడు. దాని వెనుకల నుంచి మినీగూడ్స్ ట్రక్కు వేగంగావచ్చి బస్సులను ఢీకొంది. దీం తో బస్సు, మినీట్రక్కురోడ్డుపై ఇరుక్కుపోయాయి. దీంతో దాదాపు కిలోమీటర్‌కు పైగావాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బ్లూకోట్స్ సిబ్బంది స్థానికులసహాయంతో ట్రాఫిక్‌ను క్రమ బద్దీకరించారు. ఈప్రమాదంలో మాధవి అనేమహిళ స్వల్పగాయాలతో బయటపడింది.

మావోయిస్టు అగ్రనేత మల్లా రాజిరెడ్డికి అరెస్టు వారెంట్ జారీ

మంథని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుపార్టీ కేంద్రకమిటీసభ్యుడు మల్లా రాజిరెడ్డిపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా సెషన్స్‌కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది. పెద్దపల్లిజిల్లా మంథని మండలం శాస్త్రులపల్లి మల్లారాజిరెడ్డి స్వగ్రామం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ ఎస్ఐ ఆర్‌కేసేతియా, కానిస్టేబుల్ మనోహర్ కోర్టువారెంట్‌తో బుధవారం శాస్త్రులపల్లికి వచ్చారు. మల్లా రాజిరెడ్డి అజ్ఞాతంలో ఉండడం, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అరెస్ట్‌వారెంట్‌ను స్థానికపోలీసుల సహాయం తో ఇంటితలుపునకు అంటించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో అరెస్టు వారెంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆర్‌కే సేతియా మాట్లాడుతూ మల్లారాజిరెడ్డిపై క్రైం నెం.09/25ప్రకారం వివిధసెక్షన్లకింద కేసులు బీఎన్ఎస్ 191(2),191(3),190,109, బీఎన్ఎస్ 25,27, అంసెంట్13,38(2), 39(2) యూఏపీఏ సెక్షన్లకింద కేసులు నమోదయ్యా యని, వీటిపై కాంకేర్ సెషన్స్ కోర్టు వారెంట్‌జారీ చేసిందన్నారు. సెప్టెంబర్ 11న మల్లా రాజిరెడ్డి కాంకేర్‌సెషన్స్ కోర్టులోహాజరు కావాలన్నారు.


శాస్త్రులపల్లిలో రాజిరెడ్డి ఇంటికి వారెంట్ అంటిస్తున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు

జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో మంత్రులు



ధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, శ్రీధర్‌బాబు, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఒడితెల ప్రణవ్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా రాహుల్ గాంధీ నాయకత్వంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బుధవారం చేపట్టిన ధర్నాలో జిల్లా మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్, ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్‌బాబు, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, పత్తి కృష్ణారెడ్డి, మునిగంటి అనిల్‌కుమార్, పొన్నం సత్యం, బోనాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి

గణేశ్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ అటనామస్ కళాశాల కామర్స్ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ ఎం.మల్లారెడ్డి తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.సతీష్ కుమార్‌కు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ తెలిపారు. కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీంలో భాగంగా పదోన్నతి పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన అధ్యాపకులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందించారు.

హోటల్‌లో ఫుడ్ పాయిజన్

బాలుడికి అస్వస్థత

జగిత్యాల, అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో ఉన్న శివసాయి హోటల్‌లో బుధవారం ఫుడ్ పాయిజన్‌తో విక్రాంత్ అనే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం హోటల్‌లో దోశ తిన్న విక్రాంత్ అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలుడు ఫుడ్ ఫాయిజన్‌కు గురైనట్లు వైద్యులు తెలిపారని బాలుడి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కాగా గతంలోనూ శివసాయి హోటల్‌లో ఫుడ్ పాయిజన్ జరగగా పలువురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు దానిని సీజ్ చేశారు. కానీ రెండు, మూడు రోజులకే మళ్లీ హోటల్‌ను తెరిచి నడిపిస్తున్నారు. తాజాగా బుధవారం హోటల్‌లో మరోసారి బాలుడికి ఫుడ్ ఫాయిజన్ కావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి.

నేటి నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల



- అన్నదాతలకు శుభవార్త చెప్పిన శివం కమిటీ
- వారబందీ పద్ధతిలో సరఫరా
- ఊపందుకోనున్న వానాకాలం పంటల సాగు

జగిత్యాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి షెడ్యూల్ ఖరారైంది. ఎస్సారెస్పీ నీటి విడుదల కోసం ఎదురుచూస్తున్న రైతాంగానికి శివం కమిటీ సమావేశం శుభవార్త చెప్పింది. బుధవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన రాష్ట్ర స్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ (ఎస్‌సీఐడబ్ల్యూఏఎం) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వారాబందీ పద్ధతిలో నీటిని సాగు కాలువలకు విడుదల చేయనున్నారు.

ఎస్సారెస్పీ జోన్-1 కింద గల డిస్ట్రిబ్యూటరీ కాలువ 1 నుంచి 53వ డిస్ట్రిబ్యూటరీ వరకు మొదటి ఏడు రోజులు నీటిని విడుదల చేస్తారు. ఎస్సారెస్పీ జోన్-2 కింద గల డిస్ట్రిబ్యూటరీ కాలువ 54 నుంచి 94 డిస్ట్రిబ్యూటరీ వరకు తదుపరి ఏడు రోజులు నీటిని విడుదల చేయనున్నారు. ఇలా వారాబందీ పద్ధతిలో వానాకాలం పంట సాగు ముగిసే వరకు అవసరమైన నీటిని అన్నదాతలకు అందించడానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు ప్రణాళిక రూపొందించారు.



● నేడు కాకతీయ కాలువకు...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని గురువారం ఉదయం 11 గంటలకు కాకతీయ కాలువకు విడుదల చేయనున్నారు. అదేవిధంగా లక్ష్మీ కాలువ, సరస్వతీ కాలువలు, ఎత్తిపోతల పథకాలకు సైతం నీటిని విడుదల చేయనున్నారు. గత యేడాది సైతం ఆగస్టు మొదటి వారంలో శ్రీరాంసాగర్ నీటిని వారాబందీ పద్ధతిలో విడుదల చేశారు. ఎస్సారెస్పీ అధికారులు ఇచ్చిన నివేదికకు అనుగుణంగా కాకతీయ కాలువకు 5 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 350 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 900 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 550 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి నిర్ణయించారు.

వర ప్రదాయిని శ్రీరాంసాగర్..

జిల్లాలో రెండు మండలాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ ఆయకట్టు పరిధిలో ఉంది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల వంటి మండలాలకు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా సాగు నీరు అందుతోంది. జిల్లా రైతాంగానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరప్రదాయినిగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద జగిత్యాల జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కాగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 1.60 లక్షలు, ఆదిలాబాద్‌లో 1.45 లక్షలు, కరీంనగర్‌లో 6.72 లక్షలు, వరంగల్‌లో 4.71 లక్షలు, ఖమ్మంలో 1.28 లక్షలు, నల్లగొండలో 2.87 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారన్న అంచనా ఉంది. ఇందులో వరి 3.5 లక్షల ఎకరాలకు పైగా సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు.

ఆయకట్టు రైతుల ఆశలు సజీవం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ఆశలు సజీవంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును 1983లో జాతికి అంకితం చేశారు. అప్పటి నుంచి ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. మాన్యువల్ ఆధారంగా ప్రాజెక్టు గేట్లను నిర్మాణం చేశారు. ప్రాజెక్టుకు వరదలు వచ్చే సమయంలో పెద్ద మొత్తంలో వరద వచ్చి చేరుతోంది. ఆ సమయంలో ప్రాజెక్టులోని మొత్తం 42 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తారు.

కాగా ఇటీవల మహా రాష్ట్రలోని గోదావరి నదిపై ప్రాజెక్టు ఎగువన నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను కొన్ని రోజుల క్రితం ఎత్తారు. దీంతో గోదావరి ఎగువ ప్రాంతం నుంచి నీరు వస్తోంది. దీనికి తోడు మహారాష్ట్రలోని విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులో నిండుగా ఉండడంతో దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం డ్యామ్‌లో నిల్వ ఉన్న నీటికి తోడు మరో ఒకటి, రెండు టీఎంసీల నీరు వచ్చి చేరితే ఆయకట్టు వానాకాలం పంటలకు ఢోకా ఉం డదని రైతులు ఆశతో ఉన్నారు. 45 టీఎంసీల నీరు ఉంటే తాగునీటి అవసరాలు, ఆవిరి రూపంలో పోయే నీటి లెక్కలు కలుపుకొని వానాకాలంలో ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు సరఫరా చేపడుతారని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

ప్రాజెక్టులో ప్రస్తుత నీటి పరిస్థితి ఇలా..

ఎస్సారెస్పీలోకి వరద నీరు రావడం బుధవారం కొనసాగింది. డ్యామ్‌లోకి 2,620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 40.582 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 793 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజె క్టు లోకి 31.552 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 3.757 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే..: శ్రీనివాస్‌రావు, ఎస్ఈ, పోచంపాడ్ ప్రాజెక్టు



ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రస్తుత వానాకాలం పంటల సాగుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి నిర్ణయించాం. హైదరాబాద్‌లో జరిగిన శివమ్ కమిటీ సమావేశంలో సాగు నీటి విడుదల ప్రణాళికను ఖరారు చేశారు. గురువారం నుంచి ఎస్సారెస్పీ నీటిని కాలువల ద్వారా వారాబందీ పద్ధతిలో విడుదల చేయనున్నాం.

నీటి విడుదలను స్వాగతిస్తున్నాం : మహేందర్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు, జగిత్యాల



వర్షాకాలం పంటలకు శ్రీరాంసాగర్ నీటి విడుదల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రస్తుతం కొందరు రైతులు నార్లు పోయడం, నాట్లు వేయడం వంటి పనులు పూర్తి చేసి కాలువల నీటి కోసం ఎదురు చూస్తున్నారు. సరియైన సమయంలో నీటి విడుదల నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.

10న ఉమ్మడి జిల్లాస్థాయి ఆహ్వానిత ఖో-ఖో పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉమ్మడి జిల్లా స్థాయి ఆహ్వానిత ఖో-ఖో పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేం దర్‌రావు తెలిపారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పోటీల్లో సిరిసిల్ల జిల్లా నుంచి రెండు, పెద్దపల్లి జిల్లా నుంచి రెండు, జగిత్యాల జిల్లా నుంచి రెండు, కరీంనగర్ జిల్లా నుంచి రెండు జట్లు చొప్పున పాల్గొనవచ్చని తెలిపారు.

సిరిసిల్ల క్రీడాకారులు ఎస్కే మోయినుద్దీన్‌ను, పెద్దపల్లి జిల్లా క్రీడాకారులు డాక్టర్ వేల్పుల కుమార స్వామిని, జగిత్యాల క్రీడాకారులు డాక్టర్ ఎ.రవీందర్, కరీంనగర్ జిల్లా క్రీడాకారులు వి.సూర్య ప్రకాష్‌ను సంప్రదించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే జట్లకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పురుషుల విభాగంలో నిర్వహించనున్న ఈ పోటీలతో పాటు ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఉంటుందని కార్యదర్శి తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో కాంగ్రెస్ డ్రామా..

- 10శాతం ముస్లిం రిజర్వేషన్ తీసివేస్తే మద్దతు...
- కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే ఓబీసీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలి...
- కాళేశ్వరం అవినీతితో ఆ నలుగురే...
- ఈటల ప్రమేయం ఉండదు...
- తుమ్మిడి హెట్టితో ఉమ్మడి ఆదిలాబాద్‌కు నీళ్లు ఇవ్వాలి..
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

గోదావరిఖని, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై రాహుల్‌గాంధీ డైరక్షన్‌లో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ డ్రామాలు చేస్తుందని, నాయకులు యాక్టర్లుగా, పెయిడ్ ఆర్టిస్టులుగా మారారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆరోపించారు. బుధవారం గంగానగర్‌లో బీజేపీ నాయకుడు అమరేందర్‌రావు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసి ఇప్పుడు ఢిల్లీకి ఎందుకు వెళ్లారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు ఆడుతున్నారన్నారు.

అసెంబ్లీలో 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెడతామని బీజేపీకి చెందిన 8మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చారని, తరువాత 42 శాతం రిజర్వేషన్‌లో 10శాతం ముస్లింలకు ఇస్తామని చెబుతున్నారని, దీంతో అసలైన బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో వైఎస్ఆర్ హయాంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ ఇస్తేనే వివాదం జరిగిందని, కోర్టులో వివాదం ఇంకా కొనసాగుతుందన్నారు. ఓబీసీల్లో బీజేపీకి పెరుగుతున్న మద్దతును తట్టుకోలేక బీజేపీని బీసీలకు దూరం చేసేందుకు బీసీ బిల్లు పేర కాంగ్రెస్ కుట్ర చేస్తుందన్నారు. ముస్లిం రిజర్వేషన్లను తీసివేస్తే తాము మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. రాహుల్ కుటుంబం నుంచి ప్రధాని అభ్యర్థి ఎవరు ఉండరని, ఓబీసీలే తమ ప్రధాని అభ్యర్థి అని కాంగ్రెస్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో కేసీఆర్ కుటుంబానికి చెందిన నలుగురే బాధ్యులని, ఈటలకు సంబంధం ఉండదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిపుణులను, ఐఏఎస్ అధికారులను ఎవరిని పరిగణలోకి తీసుకోలేదన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలనే బీజేపీ డిమాండ్ అన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి అవసరమైన యూరియాను కేంద్రం అందిస్తుందని, రాష్ట్రంలో మాత్రం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తుపెట్టుకోబోమని, గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామన్నారు. ఎస్సీ మోర్చ కార్యదర్శి ఎస్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, గోమాస శ్రీనివాస్, కాసిపేట లింగయ్య, రావుల రాజేందర్, బల్మూరి వనిత, కందుల సంధ్యారాణి, సోమారపు లావణ్య, మేరుగు హన్మంతుగౌడ్, మనోహర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రచయితకు సమగ్ర దృష్టి ఉండాలి

- జస్టిస్ చంద్రకుమార్
- విమలక్కకు జయశంకర్ స్ఫూర్తి పురస్కారం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రచయితకు సమ్యక్ సమగ్ర దృష్టి ఉండాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో డికె ఫౌండేషన్ చైర్మన్ దేవరకొండ కాళిదాసు పురస్కార ప్రదాతగా ప్రతియేటా ప్రదానం చేసే ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్మారక రాష్ట్ర స్థాయి స్ఫూర్తి పురస్కారాన్ని 2025 సంవత్సరానికి బుధవారం కరీంనగర్ ఫిలింభవన్‌లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ మానవీయ విలువలను పెంపొందించేందుకు కవులు, రచయితలు తమ కలాల్ని, గళాల్ని ఎక్కు పెట్టాలని అన్నారు. నాలుగు దశాబ్దాలుగా అవిశ్రాంత పోరుబాటగా ప్రతిధ్వనిస్తున్న విమలక్కకు పురస్కారం ప్రదానం చేయటం సముచితంగా ఉందని అన్నారు.

విమలక్క మాట్లాడుతూ తన పోరుబాటకు ఈ పురస్కారం తగిన గుర్తింపుగా భావిస్తున్నానన్నారు. తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి, బూర్ల వేంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య, డాక్టర్ నలిమెల భాస్కర్, పొన్నం రవిచంద్ర, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, నగునూరి శేఖర్, కందుకూరి అంజయ్య, సదాశ్రీ తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు పాల్గొన్నారు.





విమలక్కకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి పురస్కారాన్ని అందజేస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, తెరవే ప్రతినిధులు, మాట్లాడుతున్న చంద్రకుమార్

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

16 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

జగిత్యాల క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా దొంగను జగిత్యాల పట్టణ పోలీసులు అరెస్టు చేసి 16 తులాల బంగారు నగలతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన అత్తినేని చంద్రమోహన్(29) జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. శంకులపల్లి శివారులో బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా చంద్రమోహన్ పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. విచారణలో ఇటీవల జిల్లాలో పలు ప్రాంతాల్లో ఏడు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డ వ్యక్తి చంద్రమోహన్‌గా గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. చంద్రమోహన్‌పై పలు జిల్లాల్లో 25 క్రిమినల్ కేసుల తో పాటు పీడీ యాక్ట్ కింద జైలుకు సైతం వెళ్లివచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ కరుణాకర్, ఎస్సై సుప్రియ ఉన్నారు.

సౌదీ నుంచి వస్తూ గుండెపోటుతో యువకుడి మృతి

ముంబైలో విమానం అత్యవసర ల్యాండింగ్




శ్రీధర్ (ఫైల్)

కోరుట్ల రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సౌదీ నుంచి స్వస్థలానికి వస్తూ కోరుట్లకు చెందిన శ్రీ రాముల శ్రీధర్ (46) గుండె పోటుతో బుధవారం తెల్లవారు జామున మృతిచెందాడు. శ్రీరాముల శ్రీధర్ ఎనిమిది నెలల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. బుధవారం తెల్ల వారుజామున సౌదీ నుంచి హైదరాబాద్‌కు విమానంలో వస్తుండగా మార్గమధ్యలో గుండె పోటు వచ్చింది. దీంతో విషయాన్ని విమాన సిబ్బందికి తెలపగా వారు వెంటనే ముంబైలో విమానాన్ని అత్య వసర ల్యాండింగ్ చేశారు. డాక్టర్లు అతడికి సీపీఆర్ చేయగా ఎలాంటి చలనం లేకపోవడంతో మరణించాడని ధ్రువీకరించారు. మృతుడికి భార్య వీణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు పమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రంగంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మన్‌రావు తెలిపారు. 35 నుంచి 40 ఏళ్ల వయస్సు, కుడి ఛాతి మీద త్రిశూలం డమరుకం పచ్చ బొట్టు, ఎడమ భుజంపై త్రిశూలం, కుడి చేతి పై గిటార్, కత్తి, పూలతో కూడిన పచ్చబొట్లు ఉన్నాయన్నారు. మృతదేహన్ని పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచామని తెలిపారు. సమాచారం తెలిసిన వారు పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై 87126 56506, సీఐ 8712656505 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఊసే లేని ఆర్టీసీ విలీనం



- కార్మికుల ఎదురు చూపులు
- ఉద్యోగుల్లో అభద్రతా భావం
- యూనియన్లు లేక అటకెక్కిన డిమాండ్లు

భగత్‌నగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విలీన ప్రక్రియ ఊసే లేకుండా పోయింది. ప్రభుత్వంలో ఆర్టీసీతో పాటు, ఆ సంస్థ ఉద్యోగుల విలీన ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోందని కార్మికులు అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, మెట్ పల్లి, కోరుట్ల, జగిత్యాల, వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్, మంథని, గోదావరిఖని డిపోలు ఉన్నాయి. గత ప్రభుత్వం విలీన ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చి అసెంబ్లీలో బిల్లు అమోదించి గవర్నర్‌కు పంపించింది. ఆ తర్వాత బిల్లుకు ఆమోద ముద్ర పడినా ఎన్నికల కోడ్‌తో ఆ తతంగం నిలిచి పోయింది.

కాంగ్రెస్ ఆర్టీసీని, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చినా విలీన అంశాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో ఇప్పటికి వరకు చర్చలపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం విలీనంపై ప్రణాళికను సిద్ధంచేయక పోవడంతో విలీనం ఉంటుందా లేదా అని ఉద్యోగ, కార్మికులు సందిగ్ధంలో ఉన్నారు.

ఉద్యోగుల్లో అభద్రతా భావం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడ్డాక హామీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా విలీన ప్రక్రియపై చర్చలు నిర్వహించకపోవడం, నిర్ణయం తీసుకోక పోవడంతో కార్మికులు అసహనానికి గురవుతున్నారు. ఉద్యోగుల హక్కుల కోసం కొద్ది రోజుల క్రితం ఆర్టీసీ కార్మికులు దశల వారీగా ఆందోళనలు చేపట్టారు. కొన్ని సంఘాలు సమ్మెకు సైతం పిలుపునివ్వడం, ఆ తర్వాత నాయకులు యూనియన్లతో చర్చించడం, సమ్మె నిలిపి వేయడం వంటివి చోటు చేసుకున్నాయి. విలీన ప్రక్రియ నిర్వహించక పోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఉద్యోగ భద్రతపై అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతన్నారు.

అటకెక్కిన డిమాండ్లు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో యూనియన్లు లేకపోవడంతో ఆర్టీసీ కార్మికుల డిమాండ్లన్నీ అటకెక్కాయని కార్మికులు వాపోతున్నారు. ప్రధానంగా కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, 2021 పేస్కేల్, ఉద్యోగ భద్రత, యూనియన్ల పునరుద్ధరణ, రిటైర్ ఉద్యోగులకు 2017 పేస్కేల్ బకాయిలు, కార్మికుల నియమకాలు రెగ్యులర్ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి నిర్వహించాలంటున్నారు. అదే విధంగా కార్మికులపై ఉన్న పనిభారాన్ని తగ్గించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ నిర్ణయం కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ విలీన ప్రక్రియను అంశాన్ని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని కార్మికులు అంటున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ముగ్గురికి గాయాలు

వెల్గటూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కప్పారావుపేట దగ్గర బుధవారం ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్‌తో పాటు యువకుడు బస్సు కిందికి చొచ్చుకుపోగా అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం టీఎస్ 19 జడ్ 0029 నంబరు గల మంచిర్యాల డిపో సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి మంచిర్యాల వైపు వస్తోంది. బస్సు కప్పారావుపేట మసీదు వద్దకు వస్తున్న క్రమంలో ఓ స్కూల్ బస్సు కిషన్‌రావుపేటకు వెళ్లడానికి కుడివైపు తిరుగుతుండగా వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ స్కూల్ బస్సును తప్పించే క్రమంలో ఎదురుగా పాశిగామకు చెందిన కాంద్రపు మహేష్, రాయపట్నంకు చెందిన పోతరాజుల కమలాకర్, పిట్టల చందులు వస్తున్న టీజీ 21 4853 నంబరు గల ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న మహేష్ బైక్‌తో పాటు బస్సు కిందికి చొచ్చుకు పోయాడు. మరో ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. క్షత గాత్రులను పోలీసులు ఆసుపత్రికి తరలించారు.



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

చేనేత కార్మికులను ఆదుకోవాలి



చేనేత కార్మికులకు సన్మానిస్తున్న నాయకులు

సుల్తానాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా పద్మశాలి సేవా సంఘం అడహక్ కమిటీ చైర్మన్ వలస నీలయ్య అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం కనుకుల, తొగర్రాయి, కనగర్తి గ్రామాలకు చెందిన 70 మంది చేనేత కార్మికులను వెంకటేశ్వర చేనేత పారిశ్రామిక సహకార సంఘం కనుకులలో సన్మానించారు. చేనేత కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. సబ్సిడీపై యంత్రాలతోపాటు పనిముట్లు అందించాలన్నారు. ఆడెపు సుధాకర్, బత్తుల రమేష్, సదానందం, పేగడ చందు, పర్ష రమేష్, అంజయ్య, ఆడెపు చంద్రమౌళి, దిడ్డి తిరుమల్ దాస్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలకు గురికావద్దు

ఎలిగేడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలకు గురికావద్దని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై సత్యనారాయణ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ మెయిల్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీల అకౌంట్లకు ఒకే రకమైన పాస్‌వర్డ్‌ను ఉపయోగిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రతీ అకౌంట్‌కు వేర్వేరు పాస్‌వర్డ్ ఉండేలా చూసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు పలు రకాలుగా మోసాలు చేయడానికి ప్రయత్నాలు చేస్తుంటారని, వాటిని అరికట్టేందుకు పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా నష్టపోతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎరవెల్లి ముత్యంరావు, కార్మికులు

సుల్తానాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా సామ్రాజ్య వాదాన్ని వ్యతిరేకించడంతోపాటు క్యూబాకు అండగా నిలబడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్‌లో క్యూబా సంఘీభావ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ముత్యంరావు మాట్లాడుతూ క్యూబాను ఆర్థిక దిగ్బంధనంలోకి నెట్టిన అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, క్యూబాకు సంఘీభావంగా ఈనెల 10 వరకు జరిగే సంఘీభావ కార్యక్రమాల్లో జిల్లాలోని అన్ని రంగాల ఉద్యోగ, కార్మికులు పాల్గొనాలన్నారు. ఆగస్టు 7న క్యూబా ప్రజలకు సంఘీభావం నిధి అందించి సహకరించాలన్నారు. తాండ్ర అంజయ్య, మాతంగి రాజమల్లు, రవీందర్, ఎల్లయ్య, సంజీవ్, శంకర్, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): క్యూబా దేశంపై అమెరికా ఆంక్షలు విధించడం సరికాదని సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు. క్యూబాపై ఆంక్షలను వ్యతిరేకిస్తూ ఎన్టీపీసీ ప్లాంటు వద్ద నిరసన ప్రదర్శన, కరపత్రాలను విడుదల చేశారు. 60 ఏళ్లుగా అమెరికా ఆధిపత్యాన్ని ఎదిరిస్తూ క్యూబా మనుగడ సాగిస్తున్నదని, 15 లక్షల జనాభా ఉన్న క్యూబాపై అమెరికా నిర్బంధాన్ని విధించడం శోచనీయమన్నారు. గీట్ల లక్ష్మారెడ్డి, నాంసాని శంకర్, దండ రాఘవరెడ్డి, రాజ్‌కుమార్, వెంకన్న, శ్రీనివాస్, వెంకటేశం, భూమయ్య, శ్రీనివాస్, భాస్కర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఎంపీడీవో

రామగిరి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం ఎంపీడీవో శైలజారాణి తనిఖీ చేశారు. పాఠశాలలోని గదులు, కిచెన్, డైనింగ్‌హాల్, టాయిలెట్‌ల శుభ్రతను పరిశీలించారు. సీజన్ జ్వరాలు, అంటు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ ప్రదీప్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పోలీసుల అదుపులో మధ్యాహ్న భోజన కార్మికులు

ఎలిగేడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు నిర్వహించ తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగా ఎస్సై సత్యనారాయణ మధ్యాన భోజన కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. ధర్నాకు వెళుతున్న సమచారం మేరకు శృతి, రజిత, రేణుక, నవ్యను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సన్నవడ్ల బోనస్ చెల్లించాలి

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని మాజీ ఎంపీపీ నూనెటి సంపత్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. యాసంగిలో సన్నవడ్లు సాగు చేస్తే క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి పూర్తి స్థాయిలో బోనస్ డబ్బులు చెల్లించకపోవడం సిగ్గు చేటన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించాలని, లేనియెడల రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు నిదానపురం దేవయ్య, జూకంటి శిరీష, ఆడేపు రాజు, సుదాటి కరుణాకర్, నూనెటి కుమార్, మాదాసి చందు, నరేడ్ల సదయ్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాత కుటుంబానికి ప్రశంసాపత్రం అందజేత

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారంలో మాజీ ఎంపీపీ ఈద రాజమ్మ నేత్రాలను సదాశయ ఫౌండేషన్‌కు అందజేశారు. బుధవారం మృతురాలి భర్త మాజీ సర్పంచ్ ఈగ సత్యనారాయణరెడ్డికి గంగారంలో ప్రశంసా పత్రం అందజేశారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, లింగమూర్తి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, జాతీయ కార్యదర్శి బీష్మాచారి, వాసు, గాజనవేన సదయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

ఓదెల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు అందుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమసాగర్ రెడ్డి అన్నారు. బుధవారం పలువురు నాయకులతో కలిసి గుండ్లపల్లిని సందర్శించారు. కార్యకర్తలతో మాట్లాడుతూ, రేషన్ కార్డులు అందని వారు దరఖాస్తులు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ సర్పంచులు దాసరి రాజయ్య, పుప్పాల శంకర్ పాల్గొన్నారు.

శ్రీవాణి స్కూల్‌లో వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రీవాణి హైస్కూల్ యాజమాన్యం బుధవారం విద్యార్థులు, పోషకులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. మెడికవర్ ఆసుపత్రి ఫిజీషియన్లు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పోషకులకు మధుమేహం, రక్తపోటు పరీక్షలు చేశారు. రోజు వ్యాయామం చేయాలని, విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కరస్పాండెంట్ లక్ష్మణ్‌కుమార్, వైద్యులు గుర్రం కిరణ్, రాజశేఖర్, పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్ర మరువలేనిది



గోదావరిఖనిలో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోరుకంటి చందర్, కాల్వశ్రీరాంపూర్‌లో విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

గోదావరిఖని, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా జీవించిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో బుధవారం జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చందర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం తన జీవిత కాలం రాష్ట్ర సాధనకే త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. నాయకులు ఐలయ్య యాదవ్, మారుతి, కృష్ణవేణి, బాదే అంజలి, జనగామ కవిత సరోజినీ, గుర్రం పద్మ, కనకలక్ష్మి రవీందర్ రెడ్డి, వెంకటేష్, పిల్లి రమేష్ పాల్గొన్నారు.

అంతర్గాం: తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ జయ శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన కూడలి వద్ద తెలంగాణ ఉద్యమకారులు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడ నారాయణ రెడ్డి, ప్రజా గాయకుడు గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎలిగేడు: మండల కేంద్రంతోపాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు, విద్యా సంస్థలు, కార్యాలయాలలో జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన చేసిన కృషిని కొనియాడారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ స్రవంతి మోహన్‌రావు, కార్యదర్శులు హరిబాబు, పున్నమయ్య, సురేష్, మహేష్, అంజలి, లత, శివ, శిరీష, మాసోద్దీన్, శ్రవణ్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని పలు కార్యాలయాలు, పాఠశాలల్లో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీలు గోపగాని సారయ్య గౌడ్, నూనెటి సంపత్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ జగదీశ్వరరావు, ఎంపీడీఓ పూర్ణచందర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మున్సిపల్ కార్యాలయంలో జయ శంకర్ జయంతి నిర్వహించారు, ఆయన చిత్రపటానికి కమిషనర్ రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేనేజర్ అలీముద్దీన్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు,

ఓదెల: జయశంకర్ జయంతిని మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో తిరుపతి, తహసీల్దార్ ధీరజ్ కుమార్ పాల్గొన్నారు.

ధర్మారం: నమ్మిన సిద్ధాంతం కోసం కడదాక పోరాడిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి అన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాచూరి శ్రీధర్, నోముల నర్సింహారెడ్డి, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, శ్రీనివాస్, పెంచాల రాజేశం, పాల్గొన్నారు.

రామగిరి: సెంటినరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణం సమీపంలో అమరవీరుల స్థూపం ఎదుట ఏర్పాటు చేసిన జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఎంపీడీవో శైలజారాణి, తహసీల్దార్ సుమన్‌లు జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. శంకేశిరవీందర్, పూదరి సత్యనారయణ గౌడ్, భాస్కర్, రాజసంపత్, రాజన్న, పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి పాఠశాలలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి నిర్వహించారు. డైరెక్టర్ మంజులా శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు స్వప్నమహేష్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముత్తారం: మండల పరిషత్, తహసీల్దార్ కార్యాల యం, పాఠశాలలో జయశంకర్ జయంతి నిర్వహిం చారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీఎల్ఎన్.రావు మాట్లాడు తూ జయశంకర్ త్యాగం మరువలేనిదని, రాష్ట్ర ఆవి ర్భావం ఆయనతోనే సాధ్యపడిందన్నారు. ఎంపీడీవో సురేష్, ఎస్ఎస్ఎస్ పీవోజే.రాజేశం, శ్రీనివాస్, పి.జయ, డాక్టర్ జి.చంద్రమౌళి, ఎస్.పూర్ణచందర్, ఎస్.లింగ మూర్తి, ఎన్.జెరుష, పాల్గొన్నారు.

కమాన్‌పూర్: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మండలంలో నిర్వహించారు. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్‌లు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇనగంటి భాస్కరరావు, రామ్మూర్తి, మల్యాల తిరుపతి, దాసరి గట్టయ్య, పాల్గొన్నారు.

జూలపల్లి: మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో అధికారులు, నాయకులు జయశంకర్‌సార్ జయంతి నిర్వహించారు. కార్యాలయాల్లో జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిడిఓ పద్మజ, తహసీల్దార్ జక్కని స్వర్ణ, నాయబ్ తహసీల్దార్ అనిల్‌కుమార్, ఆర్ఐ విశ్వప్రసాద్, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో బీఎస్పీని బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న స్థానిక ఎన్నికలలో విజయం సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు బొంకురి దుర్గయ్య పిలుపునిచ్చారు. బుధవారం బీఎస్పీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి పేగ నరేష్, జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య హాజరై మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి వెంటనే మండల, సెక్టార్, బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేసి రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు. కాంపెల్లి బాబు, గొట్టె రాజు, పొగుల ఆనంద్, పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సిపెల్లి కొమురయ్య, మల్లరపు రవికుమార్, రామిల్ల శారదా, బీవీపీ జిల్లా కమిటీ సభ్యులు మచ్చ రాహుల్, మచ్చ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం..

(5వ పేజీ తరువాయి)

పూర్తయిన ఓటర్ల సవరణ జాబితా ఆధారంగా గ్రామ పంచాయతీ వార్డుల వారీగా మ్యాపింగ్ చేయ నున్నారు. ఆయా పంచాయతీల్లోని జనాభా, ఓటర్లను బట్టి 6 నుంచి 20కి పైగా వార్డులు న్నాయి. ఒక్కో వార్డులో 40 నుంచి 300కు పైగా ఓటర్లు ఉండనున్నారు. ఈ నెల 10వ తేదీ నాటికి మ్యాపింగ్ పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడంతో సిబ్బంది సన్నద్ధమవుతున్నారు.

గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. బుధవారం జనగామ సెక్టార్‌లోని ఐబీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, బాలింతలు పిల్లలకు తల్లిపాలను పట్టించాలని సూచించారు. చీర, గాజులు, కుంకుమ, పండ్లు అందజేశారు. టీచర్లు సరోజ, రాజ్యలక్ష్మి, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): పూసల అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణీలకు సీమంతాలు చేశారు. పాఠశాల హెచ్ఎం సుజాత మాట్లాడుతూ తల్లిపాల వల్ల పిల్లలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సమీరా, ఏఎన్ఎంలు వినోద, శారద, ఆశా కార్యకర్త పద్మ, అంగన్వాడీ టీచర్లు సుభాషిని, అంజమ్మ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రం-1లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణీకి సీమంతం, బాలికలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. నిర్వాహకురాలు జి.రజిత, ఆయా అరుణ, కొమురమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీ అంబేద్కర్ భవన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణీలకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సీడీపీవో అలేఖ్యపటేల్, సూపర్‌వైజర్ లక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.

ఖనిలో అప్రకటిత విద్యుత్ కోతలు

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో పది రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. దీనికి తోడుగా నాలుగు రోజులుగా భానుడు ప్రతాపం చూపుతుండడంతో ఉష్ణోగ్రతలు 35 నుంచి 36 డిగ్రీల వరకు పెరిగింది. విద్యుత్ కోతలు విధిస్తుండడం, రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. మధ్యాహ్నం సమయంలో గంట నుంచి అరగంట వరకు విద్యుత్ కోత విధిస్తున్నారు. ఉదయం నుంచి ఉక్కపోత మొదలవుతుంది. ప్రతి రెండవ శనివారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నప్పటికీ అప్రకటిత విద్యుత్ కోతలతో జనం పరేషాన్ అవుతున్నారు.

ఢిల్లీ ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే



ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన బీసీ ధర్నాలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని దేశ వ్యాప్తంగా బీసీ ఓటర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు రామగుండం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, నాయ కులు దీటి బాలరాజు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శికి సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శిగా నియమితులైన తాండ్ర సదానందంను బుధవారం మండల కమిటీ నాయకులు సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో సదానందం మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న పేదల జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సదానందం డిమాండ్ చేశారు. కమాన్‌పూర్ మండల కార్యదర్శి రాజారత్నం, సీపీఐ. ఏఐటీయూసీ నాయకులు ఎల్ ప్రకాష్, జిగురు రవీందర్, శ్యాంసన్, గంధం సాంబశివరావు, అన్నారావు, కొంకటి రాజయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్ద మజీద్ నుంచి అమర్ నగర్ వరకు జరుగుతున్న రోడ్డు పనులను ఇంజనీరింగ్ అధికారులతో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయ రమణారావు ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధిలో భాగంగా అన్ని వార్డుల్లో దాదాపు 33 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, శంకర్ గంజ్ నుంచి జెండా చౌరస్తా వరకు, జెండా చౌరస్తా నుంచి శుభాష్ విగ్రహం వరకు బీటీ రోడ్డు పనులు పూర్తి అవుతున్నాయన్నారు. ఏఈ సతీష్, వర్క్ ఇన్స్పెక్టర్లు బండిఅనిల్ కుమార్,వాణి, రాముడు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

న్యాయవాదులకు అండగా ఉంటాం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న న్యాయవాదులు

కోల్‌సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు బీజేపీ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి పాటు పడుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పేర్కొన్నారు. బుధవారం గంగానగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బల్మూరి అమరేందర్‌రావు నివాసంలో జరిగిన న్యాయవాదుల సమావేశంలో మాట్లాడారు. తాను న్యాయవాదిగా, జాతీయ బార్ కౌన్సిల్ సభ్యులుగా, ఎమ్మెల్సీగా పని చేశానని, తనకు న్యాయవాదుల సమస్యలు, ఇబ్బందులు తెలుసునన్నారు. ఎమ్మెల్సీగా పని చేసిన సమయంలో రూ.100కోట్ల న్యాయవాదుల సంక్షేమ నిధి, కోర్టులకు 10ఎకరాల స్థలం, బీమా సౌకర్యం వంటి పథకాల్లో తన పాత్ర ఉందన్నారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు తౌటం సతీష్, సంజయ్, ఉమర్, శైలజ, పులిపాక రాజ్‌కుమార్, జవ్వాజి శ్రీనివాస్, పూర్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచాలు ఉపయోగించాలి

ఓదెల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికులు కాటమయ్య రక్షణ కవచాలు వినియోగించుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమసాగర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శిక్షణ పొందిన కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నాగపూరి రవి గౌడ్, జాగిరి అంజి గౌడ్, వెంకటేష్ గౌడ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు. మల్లికార్జున స్వామి ధర్మకర్తగా నియమితుడైన నాగపూరి రవిని సన్మానించారు.

గుండెపోటుతో కేబుల్ ఆపరేటర్ మృతి

కోల్‌సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన కేబుల్ ఆపరేటర్ చేతాల కోటేశ్వర్లు(52) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మరణం పై కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



వేలంలో పాల్గొని గనులు సాధించుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొని గనులను దక్కించుకోవాలని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం వీకేపీ గనిలో జరిగిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. బొగ్గు గనుల వేలంలో పాల్గొంటే సింగరేణికి భవిష్యత్తు ఉంటుందని గతంలో చెప్పినట్టు పేర్కొన్నారు. కొన్ని కార్మిక సంఘాలు తమ ఉనికిని కాపాడుకోడానికి వేలంపై అబద్ధాలు ప్రచారం చేశాయని, పాల్గొనక పోవడంతో గనులు చేజారి పోయాయని, సింగరేణి యాజమాన్యం వేలంలో పాల్గొనాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన 39వేల కోట్ల బకాయిలు ఇవ్వాలని, పెర్క్స్‌పై ఐటీని రీయింబర్స్ చేయాలని, సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని, లాభాల వాటా ప్రకటించి 25 శాతం కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. గేట్ మీటింగ్‌లో యూనియన్ జనరల్ సెక్రెటరీ సారంగపాణి, నాయకులు వడ్డెపల్లి కుమారస్వామి, వేణుగోపాల్‌రావు, గట్టు శ్రీనివాస్, యాదగిరి నరేష్, కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియా రక్షణ సమావేశం



సమావేశంలో చర్చిస్తున్న అధికారులు, నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా స్థాయి 20వ సేఫ్టీ ట్రైపార్టైట్ సమావేశం బుధవారం ఎన్‌సీఓఏ క్లబ్‌లో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏరియాలో రక్షణ చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ నాగేశ్వరరావు(మైనింగ్), రాజ్‌కుమార్(ఎలక్ట్రికల్)లు మాట్లాడారు. రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని సూచించారు. పని స్థలాల్లో ఉద్యోగులకు రక్షణ పరికరాల వినియోగం, పని స్థలాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఎంఎస్ అధికారులు సూచించారు. జీఎం కమిటీ సభ్యులు రక్షణ మెరుగు పడేలా తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు ఇచ్చారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్, డీడీఎంఎస్‌లు రాజీవ్ ఓంప్రకాష్ (ఎలక్ట్రికల్), ప్రేమ్‌కుమార్ (మైనింగ్), కమల్‌చౌదరి(ఎలక్ట్రికల్), ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం మధుసూదన్, జీఎంఓఏఐ జనరల్ సెక్రెటరీ నర్సింహులు, పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం



జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జీఎం సుధాకర్‌రావు

గోదావరిఖని, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలి ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచిన కొత్తపల్లి జయశంకర్ సార్ చిరస్మరణీయుడని, తెలంగాణ అభివృద్ధి సాధించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) బీ వెంకన్న పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళుర్పించారు. జీఎం(కోఆర్డినేషన్) ఎస్‌డీఎం సుభాని, అధికారులు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జయశంకర్ అని ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు కొనియాడారు. జీఎం కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం చేసిన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు. కొటరవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సి రెడ్డి, అధికారులు శేఖర్‌బాబు, రామ్మోహన్, ప్రసాదరావు, చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, సురేఖ, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): జయశంకర్ జయంతిని టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్‌చేశారు. ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు ఐలిశ్రీనివాస్, నాయకులు మామిడి తిరుపతి, అనిల్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్, శశాంక్, వెంకటేష్, పాల్గొన్నారు.

ఓసీపీ-3 ఎస్అండ్‌డీ సెక్షన్ పిట్ కమిటీ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీనివాస్, రమేష్, ప్రవీణ్, పాల్గొన్నారు.

ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలి దశ, మలిదశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్ర కీలకమని, మలిదశ ఉద్యమంలో అన్ని వర్గాలను ఏకతాటిపై తేవడంలో ముఖ్య భూమిక పోషించిన వ్యక్తి జయశంకర్ అన్నారు. జీఎం బండి వెంకటయ్య, జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్, డీజీఎం అరవిందరావు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలి

గోదావరిఖని, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన గ్రాట్యుటీని వెంటనే చెల్లించాలని, యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరించాలని అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారిని టీఎస్‌యూసీ నాయకులు కోరారు. బుధవారం ఎఎల్‌సి అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ జనరల్ సెక్రటరీ నిమ్మకాయల ఏడుకొండలు మాట్లాడుతూ డిప్యూటీ లేబర్ కమిషనర్ చొరవ తీసుకొని సింగరేణి యాజమాన్యంతో చర్చించి సత్వరమే న్యాయం చేయాలని కోరారు. టీఎస్‌టీయూసీ, టీడీపీ నాయకులు మణిరాంసింగ్, మధుసూధన్‌రెడ్డి, మేకల రాజయ్య, సత్తయ్య, పోశం, ఓదెలు, ముదిగంటి దామోదర్‌రెడ్డి, రాజనర్సు, వీరేందర్, శ్రీనివాస్, రాజబాబు, స్వామి పాల్గొన్నారు.